
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
సోమవారం 20 జనవరి 2025



ఆకట్టుకున్న బర్డ్ వాచ్


ఆకర్షిస్తున్న సైబేరియన్ పక్షులు


పక్షి


బర్డ్‌వాచ్‌లో పాల్గొన్న పర్యాటకులు


అడవి దున్నలు

జన్నారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన బర్డ్‌వాచ్ ఆకట్టుకొంది. 15 మంది పర్యాటకులు శనివారం రాత్రి అటవీ ప్రాంతంలో బస చేసి, ఆదివారం తెల్లవారుజామున పక్షులను లెన్స్ కెమెరాల ద్వారా వీక్షించారు. విదేశీ పక్షులతోపాటు స్వదేశీ పక్షులు మైసమ్మకుంట, గన్‌శెట్టి కుంట వద్ద కనిపించడంతో ఫొటోలు తీశారు. పలు రకాల పక్షులను వీక్షించడం ఆనందంగా ఉందని పర్యాటకులు తెలిపారు. అటవీ అధికారులు చేపట్టిన పక్షుల సంరక్షణ బాగుందన్నారు. పర్యాకులకు అడవి దున్నలు, జింకలు, దుప్పులు కనిపించడంతో సంబర పడ్డారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు సుష్మారావు, శ్రీనివాస్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదంగా గడిపాను



కవ్వాల అభయారణ్యంలో అడుగుపెట్టినప్పటి నుంచి ఆహ్లాదకరంగా ఉంది. రేడియేషన్ ఫ్రీ అటవీ ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో పలు రకాల జంతువులను ప్రత్యక్షంగా వీక్షించాను. అడవి దున్నలు, జింకలు, వివిధ రకాల పక్షులు, నెమళ్లను దగ్గర నుంచి వీక్షించడం ఆనందంగా ఉంది.

-శ్యాంసుందర్, వరంగల్

పర్యావరణంపై ప్రేమ ఉండాలి



ప్రతీ ఒక్కరికి పర్యావరణంపై ప్రేమ ఉండాలి. యాంత్రిక జీవితంలో ఇబ్బందులు, ఒత్తిడిల నుంచి రిలీఫ్ పొందాలంటే అడవుల్లో పర్యటించారు. పక్షులు, అటవీ జంతువులను వీక్షించడం ఆనందంగా ఉంది. ఎప్పుడు చూడని పక్షులను చూడడం సంతోషంగా ఉంది.

- గిరిధర్‌గౌడ్, హైద్రాబాద్

పంచాయతీ భవనాలు పూర్తయ్యేదెన్నడో?

- పిల్లర్లకే పరిమితమైన చెల్కగూడ పంచాయతీ భవనం
- రేకుల షెడ్డులో కొనసాగుతున్న కార్యాలయం

7


చెల్కగూడలో అద్దె భవనం(రేకులషెడ్డు)లో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

విద్యాబుద్ధులు నేర్పడమే లక్ష్యం

- సమాయత్తమవుతున్న విద్యాశాఖ
- ప్రారంభమైన క్షేత్రస్థాయి సర్వే

6



అభయారణ్యం సందర్శన


అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి కుమారి చిన్న

జన్నారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్ జన్నారం డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్‌లోని అటవీ ప్రాంతాన్ని ఆదివారం ఐఎఫ్ఎస్ అధికారి కుమారి చిన్న సందర్శించారు. బర్తన్‌పేట్, కామన్‌పల్లి వాచ్‌టవర్‌తోపాటు మైసమ్మకుంట, గన్‌శెట్టి కుంటలను సందర్శించారు. అనంతరం అటవీ ప్రాంతంలోని గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. అటవీ అభివృద్ధికి చేపట్టిన పనులు, అడవిలో జంతువులు, వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకున్నారు. అటవీ సంరక్షణ కోసం చేపట్టిన పనులను పరిశీలించారు. ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా కేతేశ్వర కంకాలమ్మ జాతర

జన్నారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలంలోని ఈర్ల గుట్టపైన గల కేతేశ్వర కంకాలమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహేంద్ర కులస్తులు అధిక సంఖ్యలో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి మొక్కు తీర్చుకున్నారు. వంటలు చేసుకుని భోజనాలు చేశారు. జాతరకు జీసీసీ చైర్మన్ తిరుపతి, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు పసివుల్లా, రాజశేఖర్, మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భరత్ కుమార్, జనార్దన్, ఆలయ కమిటీ సభ్యులు నర్సయ్య, నర్సింగం పాల్గొన్నారు.

ఈసారైనా ఎన్నికలు జరిగేనా..!

"మూడు దశాబ్దాలకు పైగా గూడెం గ్రామంలో ఎన్నికలు జరగడం లేదు. గ్రామంలో ఒక్క గిరిజనుడు లేకపోయినా సర్పంచ్ పదవితోపాటు ఐదు వార్డు స్థానాలను షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కులస్థులకు రిజర్వ్ చేశారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి నోటిఫికేషన్ ఇవ్వ డం, నామినేషన్లు దాఖలు కాక పోవడం షరా మామూ లైంది. త్వరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈసారైనా గ్రామ పంచాయతీ రిజర్వేషన్ మారుతుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు."

- గూడెం గ్రామానికి అనుకూలించని రిజర్వేషన్
- గిరిజనులు లేకున్నా నోటిఫైడ్ ఏరియాగా
- పోటీ చేసే వారు లేక ప్రత్యేక అధికారుల పాలన
- దశాబ్దాలుగా పదవులకు నోచుకోని గ్రామస్థులు


గూడెం పంచాయతీ కార్యాలయం

మంచిర్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గూడెం గ్రామానికి ఈ సారైనా ఎలక్షన్లు జరుగుతాయా అనే సందేహాలు నెలకొన్నాయి. దశాబ్దాలుగా రిజర్వేషన్ అనుకూలించక సర్పంచ్ పదవికి ఎన్నికలు జరగడం లేదు. కనీసం ఈ సారైనా ఎన్నికలు జరుగుతాయో లేదో తెలియని గందరగోళ పరిస్థితులు ఉన్నాయి. దండేపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీకి మూడు దశాబ్దాలకు పైగా సర్పంచ్ ఎన్నికలు జరగడం లేదు. గ్రామంలో ఒక్క గిరిజనుడు లేకపోయినా సర్పంచ్ పదవిని షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కులస్థులకు రిజర్వ్ చేశారు. దీంతో 35 ఏళ్లుగా సర్పంచ్ పదవికి ఎన్నికలు జరుగకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలోనే గ్రామం కొనసాగుతోంది.

నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించడంతో...

గూడెం గ్రామపంచాయతీలో 1800పై చిలుకు మంది ఓటర్లు ఉన్నారు. గూడెంలో ఒక్కరు కూడా గిరిజనులు లేకపోయినా 1950లో అప్పటి ప్రభుత్వం గ్రామాన్ని నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించింది. రిజర్వేషన్ ప్రకారం గిరిజనులు ఎవరూ లేకపోవడంతో పోటీ చేసేవారు లేకపోవడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జీల ద్వారా పాలన కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, 1987 నుంచి గ్రామ సర్పంచు స్థానాన్ని ఎస్టీకి రిజర్వు చేశారు. సర్పంచు పదవితోపాటు గ్రామంలోని 10 వార్డు సభ్యుల స్థానాల్లో ఐదింటిని ఎస్టీలకు కేటాయించారు. అప్పటి నుంచి సుమారు 35 ఏళ్లపాటు గూడెం గ్రామ పంచాయతీకి సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు అర్హులు లభించడం లేదు. దీంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది. ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకుండా పోయాయి. అయినప్పటికీ ప్రతిసారీ పంచాయతీ ఎన్నికల సమయంలో నోటిఫికేషన్ విడుదల చేయడం, నామినేషన్లు దాఖలు కాకపోవడం షరా మామూలైంది.

ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం...

దశాబ్దాలుగా గూడెం పంచాయతీకి ఎన్నికలు జరుగకపోవడంతో గ్రామస్థులు పదవులకూ నోచుకోవడం లేదు. రాజకీయాలపై మక్కువ ఉన్నవారు, ప్రజల సమస్యలను పరిష్కరించాలని భావించేవారు ఎన్నికల్లో పోటీ చేద్దామన్నా రిజర్వేషన్ అనుకూలించక అనర్హులుగా మిగిలిపోతున్నారు. గ్రామంలో ఎస్టీ జనాభా లేదని, రిజర్వేషన్ మార్చాలని గ్రామస్థులు...

మిగతా 7లో..

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాలను మరింత అభివృద్ధి చేసేందుకు కార్పొరేషన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ చైర్మన్లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గాలకు సన్మానం

మంచిర్యాల క్రైం/లక్షెట్టిపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పదవికాలం ముగుస్తున్న నేపథ్యంలో మంచిర్యాల, లక్షెట్టిపేట, నస్పూర్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నివాసంలో ఆదివారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పదవి ముగిసిందని ప్రజలకు దూరంగా ఉండవద్దన్నారు. ప్రజలకు నిరంతరం సేవ చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, సతీమణి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి కౌన్సిలర్లను పూల మాలలు, శాలువాలతో సన్మానించారు.

సంక్షేమ పథకాలు పేదలకు అందజేయడమే లక్ష్యం

మంచిర్యాల క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 106 మంది లబ్ధిదారులకు రూ.32 లక్షల 38వేల 500 చెక్కులను అందజేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

- ఆర్టిజెన్స్‌కు ఏపీఎస్ఈబీ రూల్స్ కల్పించాలి
- ఒకే సంస్థలో ఒకే రూల్ ఉండాలి
- నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు



కరపత్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఆపరేటర్లు

మంచిర్యాల క్రైం, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌ఆర్టిజెన్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఒకే సంస్థలో ఒకే రూల్ పాటించాలని, కన్వర్షన్ చేయాలనే పలు డిమాండ్లతో విద్యుత్‌ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు నిరసన కార్యక్రమాలను చేపడుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 20వేల మంది ఉద్యోగులు ఉండగా మంచిర్యాల జిల్లాలో సుమారు 250 మంది ఉద్యోగులు ఉన్నారు. 2024జూలై 30న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్లను రెగ్యులర్ చేస్తామని అసెంబ్లీసాక్షిగా కేసీఆర్ ప్రకటన చేశారు.

అయితే ఏపీఎస్ఈబీ ఆంధ్రప్రదేశ్ చట్టం, 1947ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ స్టాండింగ్ ఆర్డర్ చట్టంలు రెండు ఉండగా ఆపరేటర్లను 1947 చట్టం ప్రకారం జీవోజారీ చేయడంతో వీరి సమస్యలు మళ్లీమొదటికే వచ్చాయి. 2017-18 సంవత్సరంలో ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి రిలే నిరాహార దీక్షలతో పాటు విద్యుత్ సంస్థల ముట్టడి కార్యక్రమాలను చేపట్టారు. అయినప్పటికి వీరి సమస్య పరిష్కారం కాలేదు. ఎన్నికల సమయంలో భట్టి విక్రమార్క వీరిని రెగ్యులరైజేషన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఆపరేటర్లు ఎస్ఈ ఆఫీసుతో పాటు ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేశారు. సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు, ఒక వాచ్‌మెన్ మొత్తం ఐదుగురు విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం ముగ్గురితో పని చేయిస్తున్నారు. విద్యార్హతల ఆధారంగా జేఎల్‌ఎం, సబ్ ఇంజనీరింగ్, జేఆర్, అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేన్స్ కల్పించాలని వినతిపత్రాలు అందించినప్పటికి న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని ఈ నెల 20 నుంచి 24వరకు రిలే నిరాహార దీక్షల నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదని, ఒకే సంస్థలో ఒకే రూల్స్ ఉండాలని, ఒకే చట్టం ఉండాలని పేర్కొంటున్నారు.

ఆర్టిజన్లను వెంటనే కన్వర్షన్ చేయాలి...



ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలి. విద్యుత్ సంస్థలో ఆర్టిజెన్స్‌ను వెంటనే కన్వర్షన్ చేయాలి. ఒకే సంస్థ ఒకే రూల్స్ ఉండాలి. నిరసన కార్యక్రమంతో సమస్యలు పరిష్కారం కాకుంటే జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ముట్టడి కార్యక్రమాన్ని చేపడతాం.

- టీవీజేఏసీ జిల్లా అధ్యక్షుడు పసుల తిరుపతి

ఒకే సంస్థలో ఒకే రూల్ ఉండాలి..



విద్యుత్ ఆపరేటర్లుగా పని చేస్తున్న వారికి సంస్థలో ఒకే రూల్స్‌ను వర్తింపజేయాలి. లైన్‌మన్‌కు ఇచ్చే సమాన వేతనం అందించాలి. అందరికి ఒకే చట్టం వర్తింపజేయాలి. కోర్టు అడ్డంకులు తొలగినందున ఏపీఎస్ఈపీ రూల్స్ వర్తింపజేయాలి. ఐదుగురు చేసే పనిని ముగ్గురితో చేయిస్తున్నారు. దీంతో పని ఒత్తిడి పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి డిమాండ్లను పరిష్కరించాలి.

- చిందం వెంకటేష్, టీవీజేఏసీ గౌరవ అధ్యక్షుడు

టీజీఎఫ్‌డీసీ ప్రతినిధిగా సురేష్ కుమార్


సురేష్ కుమార్

మంచిర్యాల క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్న టీజీఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్ల తరపున అధికార ప్రతినిధిగా మంచిర్యాలకు చెందిన గోగు సురేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ప్లాంటేషన్ మేనేజర్లు హైదరాబాద్‌లోని బోటానికల్ గార్డెన్‌లో సమావేశమయ్యారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో సురేష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్లాంటేషన్ మేనేజర్ల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమైన మహిళా శక్తి క్యాంటీన్

మందమర్రిరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్మించిన మహిళా శక్తి క్యాంటీన్ భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో మహిళ శక్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో మండల సమాఖ్య నిధులతో మహిళ శక్తి క్యాంటీన్‌ను నిర్మించారు. ఈ క్యాంటీన్ నిర్వహణ పొదుపు సంఘాల మహిళలే మండల సమాఖ్య ఆధ్వర్యంలో చూసుకుంటారు. క్యాంటీన్‌లో టిఫిన్‌లు, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఈ నెలలోనే క్యాంటీన్ ప్రారంభిస్తామని ఏపీఎం లలితకుమారి తెలిపారు.

మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలకు కట్టుబడి ఉన్నాం


మందమర్రిలో అధికారులతో సమావేశంలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలకు కట్టుబడి ఉన్నానని, పాలకవర్గం లేకపోవడంతో ప్రజలకు జవాబుదారిగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యేడాది కాలంలో రూ.7 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. తాగు నీటి కోసం పైపులైన్ పనులు నడుస్తున్నాయన్నారు. మందమర్రిలో ఇటీవల నిర్మించిన 520 గృహాల్లో పారదర్శకంగా 243 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశామన్నారు. అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మరో వైపు ఇందిరమ్మ ఇండ్ల సర్వే కూడా జరుగుతుందన్నారు. రేషన్ కార్డులకు సంబంధించి ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చాయని, అర్హులైన వారందరికి రేషన్ కార్డులు వస్తాయన్నారు. పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

చెన్నూరును అభివృద్ధి చేస్తా

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): చెన్నూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. చెన్నూరు మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు, నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. పలు వార్డుల్లో తిరుగుతూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్య లను పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమ స్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం పట్టణంలోని బట్టిగూడెం కాలనీలోని లక్ష్మీదేవి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు ఎమ్మెల్యేను సన్మానించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెన్నూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి

భీమారం, (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. భీమారంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రేషన్ కార్డు జాబితాలో అర్హుల పేర్లు లేవని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ కార్డులతోపాటు ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా అర్హులకు అందేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎల్‌బీపేటలో రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మహేష్ అనారోగ్యానికి గురికాగా పరామర్శించారు. నాయకుల పాల్గొన్నారు.



రైతులు వడ్డీ కట్టి రెన్యూవల్ చేసుకోవాలి

జె రాకేష్, సీఈవో, కోఆపరేటివ్ బ్యాంక్, సిర్పూర్(టి)

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: బ్యాంకులో ఎంత మంది సభ్యులు ఉన్నారు?

సీఈవో : బ్యాంకు పరిధిలో 2500మంది సభ్యులు ఉండగా 1300మంది రైతులు రూ.10కోట్ల రుణాలు పొందారు. ఇందులో ఇప్పటివరకు 60శాతం రెన్యూవల్ పూర్తి అయింది. మిగితా రైతులు సకాలంలో వడ్డీలు చెల్లించి తిరిగి రుణాలు పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి: అప్పు కట్టని రైతులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఈవో : దీర్ఘకాలిక, స్వల్ప కాలిక అప్పులు తీసుకొని తిరిగి చెల్లించని వారిపై 71 సెక్షన్ చట్టం ప్రకారం లీగల్ నోటీసులు జారీ చేసి వందశాతం అప్పు కట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. వారికి అవసర నిమిత్తం అప్పు ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఈ వానాకాలంలో ఎన్ని టన్నుల యూరియా ఇచ్చారు?

సీఈవో : ఈ వానాకాలంలో రైతులకు 800టన్నుల యూరియా, డీఏపీ ఇచ్చాం. యాసంగిలో సైతం రైతులకు ఎరువులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

- సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి)

విద్యాబుద్ధులు నేర్పడమే లక్ష్యం

విద్యార్థులందరికీ చదువే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బడిబయట పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించడానికి అధికారులు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేను ఈ నెల 26వరకు చేపట్టనున్నారు.

- సమాయత్తమవుతున్న విద్యాశాఖ
- ప్రారంభమైన క్షేత్రస్థాయి సర్వే



వాంకిడి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పడమే లక్ష్యంగా బడిబయట పిల్లల సర్వేకు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమైంది. ఈనెల 17నుంచి 26వ తేదీ వరకు పిల్లలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, ప్రత్యేక అధికారులు ఇందులో భాగస్వాములై బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించనున్నారు. బడిబయట ఉన్న పిల్లల సర్వేలో ప్రధానంగా 6నుంచి 14సంవత్సరాలలోపు వయసు ఉండి బడిబాట పట్టని వారితోపాటు 14సంవత్సరాల పైబడిన 19సంవత్సరాలలోపు ఉన్న వారిని గుర్తించనున్నారు. ఐదు సంవత్సరాలు నిండి ఉండి అసలే బడిలో చేరని పిల్లలు, బడి ఈడు ఉండి బడిలో చేరని పిల్లలు, వరుసగా 30రోజులపాటు బడికి వెళ్లకుండా డ్రాప్‌అవుట్‌లు ఉన్నవారిని వెతికి బడి బాట పట్టించడం, పాఠశాలల్లో చేర్పించడం వంటివి చేయనున్నారు. ముఖ్యంగా వలస కార్మికులు, ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లి పనులు చేసుకునే కుటుంబాల పిల్లలు, ఇతర రాష్ట్రాల వారు ఇక్కడికి వచ్చి పనులు చేసే కుంటుబాల పిల్లలను ఇందులో పరిశీలన చేయ నున్నారు. ఈనెల 26వ తేదీ వరకు ఈ సర్వే చేపట్టనున్నారు. ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందిచనున్నారు.

● వలస వచ్చిన వారిలో ఎక్కువ మంది..

వలస కార్మికుల్లో ఎక్కువగా బడిబయట ఉన్న పిల్లలు, బాలకార్మికులు కనిపిస్తారు. సీజనల్‌గా వచ్చి మూడు నెలలు పనిచేసి వలస కార్మికులు వెళ్లి పోతారు. వారి కుటుంబాలు ఇక్కడ పనులకు వచిచనప్పుడు వెంట తమ పిల్లలను తీసుకొచ్చి పనులు పూర్తయ్యాక తిరిగి తీసుకెళ్తుంటారు. ఇలా వలస వచ్చిన కార్మికుల పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశాలు ఉంటున్నాయి. అలాంటి వలస కుటుంబాల వారి పిల్లల గురించి ఆరాతీసి వారిని పాఠశాలల్లో చేర్పిచేందుకు చర్యలు తీసుకుంటారు.

● జిల్లాలో పాఠశాలలు..

జిల్లాలో మొత్తం 1258పాఠశాలలు ఉండగా ఇందులో 15కస్తూర్బాలున్నాయి. వీటిలో53వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత, తల్లిదండ్రుల్లో అవగాహన లేమి కారణంగా జిల్లాలో బడిబయటి పిల్లల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అనేక గ్రామాల్లో పదోతరగతి తరువాత చదువులు మానేస్తున్న వారు కూడా అధికంగా ఉన్నారు. ప్రస్తుత సర్వేలో ఇలాంటి వారందరినీ గుర్తించేందకు విద్యాశాఖ కార్యచరణ రూపొందించింది.



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ సందీప్

పకడ్బందీగా సర్వే..



బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ఈనె ల 17నుంచి నెల 26వ తేదీ వరకు పకడ్బందీగా సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బడిఈడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించడం, డ్రాప్‌అవుట్‌లను గుర్తించడం, బడిబాట పట్టని వారిని గుర్తించి బడుల్లో చేర్పించేలా చర్యలు తీసకుం టున్నాం. షెడ్యూల్ ప్రకారం సర్వే పూర్తి చేసి ఎప్పటి పృడు వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ఎవరైనా బడి బయట ఉన్న పిల్లలు ఉంటే 9666665253 నంబ రును సంప్రదించాలి.

- శివచరణ్‌కుమార్, ఎంఈవో

వారసంతలో వసతులు కరువు

- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు

కెరమెరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించే వారసంత సమస్యలకు నిలయంగా మారింది. కనీసౌకర్యాలు లేక వ్యాపారస్తులతోపాటు సంతకు వచ్చే కొనుగోలుదారులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారసంతలో వ్యాపారస్తులకు వస్తువులు పెట్టుకోవడానికి, కూర్చోడానికి గద్దెలు లేవు. వర్షాకాలం బురదలో నేలపై పాల్తీన్‌కవర్లు వేసుకుని కూర్చొని కూరగాయలు, నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సరైనరోడ్డు లేక బురదలోనే నడవాల్సిన దుస్థితినెలకొంది. వేసవిలో కనీసం తాగునీటి సౌకర్యం సైతంఉండదని వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సైతం లేక వారసంతకు వచ్చేవిని యోగదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఒకే ఒకవారసంత ఉండడం వల్ల ఈసంతకు మండలంతో పాటు జైనూరు, ఆసిఫాబాద్ మండలంలోని అడ, వాడిగూడ గ్రామస్థులు, నార్నూర్, మహా రాష్ట్రలోని జివితితో పాటు వివిధగ్రామాలప్రజలు వచ్చి వారానికి సరిపడా వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు.



నేలపై కూర్చుని కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఇబ్బందులు పడుతున్నాం..

- తయ్యూమ్, వ్యాపారి

వారసంతలో చాలా ఏళ్ల నుంచి ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు విక్రయిస్తున్నా. వర్షాకాలం, ఎండకాలం అనేక ఇబ్బందులు పడుతూ వ్యాపారం చేస్తున్నాం. శాశ్వతంగా విక్రయించేందుకు గ్రామపంచాయతీ అధికారులు గద్దెలు, ఇతర ఏర్పాట్లు చేయాలి. వర్షాకాలం పరిస్థితి దారుణంగా ఉంటుంది. బురద నీటిలోనే తీవ్రఇబ్బందులు పడుతూ విక్రయాలు జరుపుతుంటాం.

వసతుల కల్పిస్తాం..

- అంజద్‌పాషా, ఎంపీడీవో

కెరమెరి వారసంతలో సౌకర్యాల కల్పనకు కృషిచేస్తాం. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి రూ.3లక్షల నిధులు ఇటీవల మంజూరయ్యాయి. తాగునీటికి ఏర్పాట్లు చేస్తాం. వ్యాపారస్తుల కోసం శాశ్వతంగా గద్దెలు నిర్మించేందుకు కృషి చేస్తాం.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

- కాళేశ్వరం జోన్ గేమ్స్‌అండ్‌స్పోర్ట్స్ మీట్‌లో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు

కోల్‌సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని రామగుండం కమిషన రేట్ అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు అన్నారు. ఆదివారం రాష్ట్రస్థాయి పోలీస్ గేమ్స్‌అండ్‌స్పోర్ట్స్‌మీట్ పోటీల కోసం క్రీడాకారుల ఎంపిక పోటీలను గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ మైదానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములనేవి సహజమ న్నారు. గెలుపోటముల కంటే టీమ్ స్పిరిట్ గొప్పదన్నారు. పోలీసులు ఎల్లప్పుడూ విధినిర్వహణలో ఉంటారని, అలాంటి వారిలో క్రీడలు నూతన ఉత్సాహంతోపాటు ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించు కోవాలన్నారు. ఇక్కడ ఉత్తమప్రతిభ కనబరిచిన వారు కాళేశ్వరం జోన్ తరుపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొం టారని తెలిపారు. ఈ పోటీల్లో రామగుండం పోలీస్ కమిషన రేట్, కుమరంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీస్ టీమ్స్ పాల్గొన్నాయి.

కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, మల్లేశం, సంపత్, ములుగు ఆర్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న పోలీస్ క్రీడాకారులు

నేడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

సిర్పూర్(టి), జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ నమూనా గృహనిర్మాణానికి ఎమ్మెల్యే హరీష్‌బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్ నేడు భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

టీస్టాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పెట్రోల్‌పంపు ఏరియాలో టీస్టాల్‌ను ఆదివారం ఎమ్మెల్యే హరీష్ బాబు ప్రారంభించారు. ఈ చాయ్ దుకాణాన్ని పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోలాడి హన్మంతురావు, పిర్సింగుల తిరుపతి, పిప్పిరి రామన్న తదితరులు పాల్గొన్నారు.



టోకెన్ సమ్మెపై తప్పుడు ప్రచారం

జైపూర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల18న నిర్వహించే ఒక్కరోజు టోకెన్ సమ్మె విజయవంతంగా కొనసాగిందని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ వైస్‌ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికసంఘం నాయకుడు విక్రమ్ పేర్కొన్నారు. ఆదివారం జైపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఎస్టీపీపీలో 1040మంది కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొని ప్రధాన గేటు ముందు ధర్నా, నిరసన కార్యక్రమాన్ని జరిపిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కానీ సమ్మె జరగలేదని, సింగరేణి ఉన్నతాధికారుల మెప్పు పొందడం కోసం ఎస్టీపీపీ యాజమాన్యం అసత్య ప్రచారం చేస్తోందన్నారు. ఇప్పటికైనా ఎస్టీపీపీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే నిరవధిక సమ్మె చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, చిప్పకుర్తి సంపత్, నవీన్‌చారి, సంతోష్, సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం... అభివృద్ధి నినాదంతో ముందుకుసాగాలి

- సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం ఏరియా మహాసభలో వక్తలు

శ్రీరాంపూర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు ఆత్మగౌరవం.. అభివృద్ధి నినాదంతో ముందుకు సాగాలని వక్తలు పేర్కొన్నారు. సీసీసీలోని ఎస్‌సీవోఏ క్లబ్‌లో శ్రీరాంపూర్ ఏరియా ప్రథమ మహాసభను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ఏ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, సింగరేణిలో బీసీ ఉద్యోగులు మెజారిటీగా ఉన్నారని, కానీ వారికి రావాల్సిన హక్కుల్లో అడుగడుగునా అన్యాయం జరుగుతోందన్నారు. ఇటీవల బీసీఉద్యోగుల కోసం లైజనింగ్ అధికారిని నియమించడం హర్షణీయమన్నారు. బీసీచీఫ్ లైజనింగ్ ఆఫీసర్ పి హరిశంకర్‌రావు మాట్లాడుతూ, ఇన్ని రోజులు బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులకు గురయ్యారని, ఇక నుంచి ఎలాంటి సమస్యనైనా తనకు విన్నవిస్తే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఆర్కే7 గ్రూపు ఏజెంట్ కుర్మ రాజేందర్, ఎస్ఈ(ఐఈడీ) కె కిరణ్ కుమార్, సంఘం సలహాదారు చిలుక శ్రీనివాస్, తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఏ నాగేశ్వర్ రావు

పలు తీర్మానాలు: ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఉద్యోగుల యాక్టింగ్ బేస్డ్ పదోన్నతుల్లో రోస్టర్ విధానం ప్రకారం రిజర్వేషన్, అధికారుల పదోన్నతుల్లో రూల్‌ఆఫ్ అములు చేయాలని తదితరాలను సభ ఏకగ్రీవంగా తీర్మాణించింది.

ఏరియా కమిటీ ఎన్నిక: ఏరియా ఉపాధ్యక్షుడిగా జి శ్రీనివాస్, కార్యదర్శులుగా బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శులుగా రణదీప్, చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శులుగా రవీందర్, రాజేశ్, మహేందర్, శ్రీకాంత్, చీఫ్‌ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రఘురాం, సంతోష్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగి రంగు రాజేశం, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ రావు, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీ సైదా, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు పాల్గొన్నారు.

కాలనీల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు నివసించే కాలనీల్లో ఆహ్లాదకర వాతావరణం ఉడాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన నస్పూర్‌కాలనీలోని సింగరేణి క్వార్టర్లను సందర్శించి ఉద్యోగుల కుటుంబాల సమస్యలు తెలుసుకున్నారు. మురుగునీరు ఇంట్లోకి వస్తోందని, వర్షాకాలంలో క్వార్టర్లు ఊరుస్తున్నాయని, తాగునీరు శుభ్రంగా లేదని, పలువురు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అధికారులు కాలనీలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని గుర్తుచేశారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో సొంతింటి పథకం అమలయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంగళ శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్, మిడివెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



హరికృష్ణ(ఫైల్)

ఆసిఫాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పల్ నౌగాం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన సెండె హరికృష్ణ(22) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. హరికృష్ణ పని నిమిత్తం వాంకిడికి వెళ్లి అక్కడి నుంచి బైక్‌పై ఆసిఫాబాద్ వైపు వస్తున్నాడు. ఇప్పల్‌నౌగాం గ్రామ సమీపం లోకి రాగానే జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతని తల, ముఖంపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి యువతి ఆత్మహత్య



సింధు (ఫైల్)

రెబ్బెన, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం పుంజుమేరగూడ సమీపంలో శనివారం రాత్రి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి యువతి ఆత్మహత్య చేసుకున్నట్టు బెల్లంపల్లి జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామం గొల్లవాడకు చెందిన కోట సింధు(19) శనివారం వరంగల్ నుంచి భాగ్యనగర్ రైలు నుంచి ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో దిగిందన్నారు. అక్కడి నుంచి కొద్ది దూరం వెళ్లి పుంజుమేర గూడ సమీపంలో భాగ్యనగర్ తర్వాత వచ్చిన బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలి పారు. ఆమె ప్రస్తుతం వరంగల్‌లో డిగ్రీమొదటి సంవత్సరం చదువుతుందన్నారు. కొంత కాలంగా ఆరోగ్యం బాగుండటం లేదని కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిందన్నారు. సింధు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

దహెగాం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరివెల్లి గ్రామానికి చెందిన రైతు మధుకర్ ఇంట్లో నిల్వ ఉన్న పత్తి ఆదివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు పత్తికి అంటుకున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఇరుగుపొరుగు వారి సాయంతో నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. సుమారు 10ఎకరాల్లో పత్తిని ఇంట్లో నిల్వ చేశారు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అయిదు క్వింటాళ్లకు పైగా నష్టపోయినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనం పట్టివేత

వాంకిడి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అక్రమంగా పశువులను తరలిస్తున్న ఓ వాహనాన్ని ఆదివారం ఉదయం పట్టుకున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు వాంకిడి మండలంలోని ఖమాన ఎక్స్ రోడ్డు టోల్‌ప్లాజా సమీపంలో సిబ్బందితో కలిసి వాహనాన్ని పట్టుకున్నామన్నారు. అనుమతి లేకుండా వాహనం(టీఎస్ 18టి 2636)లో మహారాష్ట్రలోని గోండ్ పిప్పిరి వైపు నుంచి నిజామాబాద్‌లోని సటాపూర్ మార్కెట్‌లో విక్రయించేందుకు 17 ఆవులు, 4 ఎద్దులు, 5బర్రెలు మొత్తం 26పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద పత్రాలు లేక పోవడంతో డ్రైవర్ టగ్యాలె శైలాని, భైన్సాకు చెందిన వ్యాపారి సులేమాన్, ఫసి, పోయేగాకు చెందిన షేక్‌అబ్దుల్, వాంకిడికి చెందిన షేక్ మోసీన్, ఆసిఫాబాద్‌కు చెందిన అజ్జు, కెరమెరికి చెందిన ఆసీఫ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



బెల్లంపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బెల్లంపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయని పూర్వ విద్యార్థులు సీహెచ్ పూర్ణచందర్‌రావు, జి.సత్యనారాయణలు పేర్కొన్నారు. 1974-75 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం కాల్‌టెక్స్‌లో గల ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. అప్పుడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరు కలుసుకుని జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులు ఎండీ సాధిక్ పాషా, టి. రాజేశ్వర్‌రావు, శివకుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని ఏసీసీ ఎంసీడబ్ల్యూఈఈహెచ్‌ఎస్ పాఠశాల 2000-01 పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఏకేఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. గురువులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకుమారి, పాండురంగరావు, మురళీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేసిన షౌకత్‌అలీఖాన్

మందమర్రిటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కేకే విద్యా విహార్ పాఠశాల నెలకొల్పి విద్యాభివృద్ధికి దివంగత షౌకత్ అలీఖాన్ కృషి చేశారని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం రామన్‌కాలనీలో షౌకత్ అలీఖాన్ సంస్మరణ సభ, గ్రంథాలయం భూమి పూజకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు గ్రంథాలయం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పోలు శ్రీనివాస్, లయోలకుమార్, అరుణో దయ సమ్మిరెడ్డి, తవక్కల్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

తల్లికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తె

నెన్నెల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పొట్లపల్లి రాజక్క (87) ఆదివారం మృతి చెందింది. ఆమెకు కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కొడుకు ఓ కేసులో జైలుకు వెళ్లాడు. చిన్న కూతురు బుజ్జమ్మ మూడేళ్లుగా తల్లికి సపర్యాలు చేస్తోంది. తల్లికి చిన్న కూతురు తలకొరివి పెట్టింది.

మాలమహానాడు నాయకుడిపై ఫిర్యాదు

దండేపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాల మహానాడు నాయకుడు పసుల రామ్మూర్తిపై ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన నవీన్‌కుమార్ మాట్లాడుతూ మంద కృష్ణమాదిగపైన భౌతికంగా దాడిచేయాలని ప్రజలను రెచ్చగొడుతూ మాట్లాడాడన్నారు. రామ్మూర్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈసారైనా ఎన్నికలు జరిగేనా...!

5వ పేజీ తరువాయి

పలుమార్లు ఆందోళనలు చేశారు. రిజర్వేషన్లు మార్చాలని సామూహిక నిరహార దీక్షలు, రాస్తారోకో, తదితర నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఎప్పటిలాగే ఉంది. త్వరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లలో మార్పులు ఉండనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీసీ రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్లు తెరపైకి వచ్చాయి. గతంలో ఉన్న 27శాతం బీసీ రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచాలనే డిమాండ్లు ఉన్నాయి. ఈ క్రమంలో రిజర్వేషన్ల మార్పులు జరిగి, తమకు కూడా అవకాశం వస్తుందనే భావనలో గూడెం గ్రామానికి చెందిన ఆశావహులు ఉన్నారు. తమ గ్రామపంచాయతీ రిజర్వేషన్ మారుతుందని గ్రామస్థులు గంపెడాశతో ఉన్నారు. రాష్ట్రం లోని పంచాయతీలకు చివరిసారిగా 2019లో ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీకాలం 31జనవరి 2024తో ముగిశాయి.

సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న టీఎన్‌జీవో నాయకులు

గర్మిళ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవో హౌజింగ్ సొసైటీ సమస్యలను పరిష్కరించాలని అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి మహ్మద్ హబీబ్‌హుస్సేన్‌లు ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావుకు వినతిపత్రం అందించారు. 23 గుంటల పార్కు స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని, టీఎన్‌జీవో కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. నాయకులు మొండయ్య, కళావతి, పద్మ, దేవి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, రవీందర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, నానయ్య, డేవిడ్ రాజు, కుమారస్వామి, సర్దార్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పట్టణ యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా మనోహర్



నియామక పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా గొడిసెల మనోహర్(మణి) నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ ఆదివారం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నియామకపత్రం అందించారు. యువత రాజకీయాల్లో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్, టౌన్ యూత్ అధ్యక్షుడు సబ్బని అరుణ్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఆలీబాయ్, నాయకులు లడ్డు, శ్రీధర్, శ్యామ్,నవీన్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

చెన్నూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఆదివారం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్‌హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ చీఫ్ జిల్లా కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన చెన్నూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. శిబిరంలో 77 మంది రక్తదానం చేశారని పేర్కొన్నారు. చందూరి మహేందర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి, వెంకటేశ్వర్, వెంకటనర్సయ్య, సాగర్, సదానందం, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలు పూర్తయ్యేదెన్నడో?

- పిల్లర్లకే పరిమితమైన చెల్కగూడ పంచాయతీ భవనం
- రేకుల షెడ్డులో కొనసాగుతున్న కార్యాలయం

దండేపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. భవనాలు నిర్మించకపోవడంతో అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. గతంలో రెబ్బనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చెల్కగూడను 2019లో ప్రత్యేక పంచాయతీగా అధికారులు ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి చెల్కగూడ గ్రామపంచాయతీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. 2023లో అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పంచాయతీ భవన నిర్మాణానికి ఉపాధిహామీ పథకంకింద రూ.20లక్షలు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ సుమారు రూ.7లక్ష 40వేల వరకు ఖర్చు చేసి పిల్లర్ల వరకు పనులు చేపట్టాడు. ఈజీఎస్ బిల్లులు రాగానే నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తానని సంబంధిత కాంట్రాక్టర్ పేర్కొంటున్నారు. దీంతో చెల్కగూడ గ్రామ పంచాయతీ భవనం పిల్లర్ల స్థాయికే పరిమితమైంది. రేకుల షెడ్డులోనే పంచాయతీ కార్యాలయం కొనసాగుతుంది. అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చెల్కగూడలో పిల్లర్లకే పరిమితమైన గ్రామ పంచాయతీ భవనం

8 గ్రామ పంచాయతీలకు స్థలాలు లేకనే...

తాళ్లపేట, మాకులపేట, నాగసముద్రం, నర్సాపూర్, కర్ణపేట, నెల్కివెంకటాపూర్, ముత్యంపేట, రెబ్బనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పక్కా భవన నిర్మాణానికి మోక్షం కలగడంలేదు. ఎనిమిది పంచాయతీ భవనాలకు ఈజీఎస్ పథకం ద్వారా నిధులు మంజూరైనప్పటికీ స్థలాలు లేక పోవడం గమనార్హం. స్థలాలు ఉన్న చోట నిర్మాణం చేపట్టగా నిధులు మంజూరు కాక పోవడంతో అసంపూర్తిగా మిగిలాయి. గూడెంలో ఉన్న గ్రామ పంచాయతీ భవ నం పూర్తిగా శిథిలావ స్థలోకి చేరింది. ఏడేళ్ల క్రితం అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టి, నిధులు రాకపోవడంతో అర్థాంతరంగా నిలిపి వేశారు. అధికారులు, సిబ్బంది ఇబ్బందుల నడుమ పాత పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహి స్తున్నారు. దండేపల్లిలో కొత్త పంచాయతీ భవనం నిర్మాణం కేవలం స్లాబ్ వరకు చేపట్టి వదిలేశారు.



చెల్కగూడలో అద్దె భవనం(రేకులషెడ్డు)లో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం



దండేపల్లిలో స్లాబ్ లెవల్‌లో నిలిచిన పోయిన గ్రామ పంచాయతీ భవనం

బిల్లులు రాగానే పూర్తి చేస్తాం

చెల్కగూడగ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు చేపట్టి బిల్లులు రాకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా వదిలేశారన్నారు. కాంట్రాక్టర్ పిల్లర్ల స్థాయి వరకు పనులు చేపట్టారు. బిల్లులు రాగానే నిర్మాణ పనులను సత్వరమే చేపట్టి పూర్తి చేస్తాం.

\- అన్వర్ పంచాయతీ రాజ్ ఏఈ

పదో వార్డు ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

నస్పూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నస్పూర్ మున్సిపాలిటీ 10వ వార్డు కమిటీని ఆదివారం మండల ఇన్‌చార్జీ చుంచు శంకర్ వర్మ ప్రకటించారు. పదో వార్డు అధ్యక్షుడిగా బచ్చల రమేష్, ఉపాధ్యక్షుడిగా కొయ్యల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా జీవన్, ప్రచార కార్యదర్శిగా జిలకర వెంకట్, ఇరికిల్ల శివ, కోశాధికారిగా గొడిసెల ప్రవీణ్ కుమార్, అధికార ప్రతినిధిగా లవ కుమార్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొప్పర్తి రాజం, కొయ్యల కొమురయ్య, బాన య్య, అంజయ్య, పురుషోత్తం, రాయలింగు, బచ్చల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

మంచిర్యాల క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 6వ తరగతిలో వంద సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ 9949015156లో సంప్రదించాలని తెలిపారు.

ఆలయం సందర్శన

మందమర్రిరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సారంగపల్లి గ్రామంలోని దుబ్బపల్లిలో నిర్మిస్తున్న సత్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం ఎంపీడీవో రాజేశ్వర్ దంపతులు సందర్శించారు. ఆలయానికి సత్యనారాయణ స్వామి విగ్రహాన్ని అందజేస్తానని ఎంపీడీవో తెలిపారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కాసిపేటలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న కాసిపేట మండల ప్రీమియర్‌లీగ్ సీజన్ 3 పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యం, మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. పోలీసు శాఖ క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను కోల్పోతున్నారని ఇది సరైంది కాదన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులను అభినందించారు. క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్, పది ఫ్రాంచైజెస్ యజమానులు, నిర్వాహకులు మేరుగు శ్రీనివాస్, దాసరి శంకర్, నామసాని రాజు, తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలి



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వీవీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కువ మంది క్రికెట్‌ను ఇష్టపడతారని పేర్కొన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యం పెరుగుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫయాజ్, మారుతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- మండలం, నియోజకవర్గం వేర్వేరుతో అభివృద్ధికి దూరం
- గుంతలమయంగా చిన్నగుడిపేట, పెద్దగుడిపేట రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు
- మరమ్మతు చేయించాలని వేడుకోలు



కంకర తేలిన చిన్నగుడిపేట రహదారి

భీమిని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమిని మండలంలో మారుమూల గ్రామాల రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఏళ్ల తరబడి మరమ్మతు చేయకపోవడంతో ఆ రోడ్లపై ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి చిన్నగుడిపేట, పెద్దగుడిపేట, వెంకటాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వడాల గ్రామం నుంచి చిన్నగుడిపేట, పెద్దగుడిపేటకు సుమారు5 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు కంకర తేలి చెట్లతో రహదారి మూసుకపోయి ప్రమాదకరంగా మారింది. ఎదురెదురుగా వాహనాలువస్తే కనీసం పక్కకు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

● మండల పరిధి ఒకటి... నియోజకర్గం వేరేది...

కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటులో భాగంగా సిర్పూర్ నియోజకవర్గంలోని చిన్న గుడిపేట, కేస్లాపూర్, పెద్దతిమ్మాపూర్ గ్రామాలను మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గ పరిధి భీమిని మండలంలో కలిపారు. దీంతో నియోజకవర్గం, మండలాలు వేరువేరు కావడంతో ఎమ్మెల్యేలు సైతం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

గ్రామాల సమస్యలు ఎవరికి చెప్పాలి...

కొత్త మండలాల ఏర్పాటులో తమ గ్రామాల నియోజకవర్గాలు మారడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నియోజకవర్గ ఓట్లు సిర్పూర్ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. దీంతో మండల పరిధిలోని నాయకులు సమస్యలు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. మా నియోజకవర్గం కాదని నేతలు అనడంతో ఆ గ్రామాల ప్రజల పరిస్థితి ఇబ్బం దికరంగా మారింది.

దీంతో తమ గ్రామాల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని అభివృద్ధి పనులు, నిధుల మంజూరులో జాప్యం ఏర్పడుతుందని ప్రజలు వాపోతు న్నారు. గ్రామాల్లో రోడ్ల సమస్యలు, ఇతర సమస్యలు పరిష్కారం కావడంలేదు.

కంకర రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం...



ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు కంకరరాళ్లు తగిలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, నాయకులు స్పందించి బీటీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలి.

\- పెసరు లింగయ్య, చిన్నగుడిపేట

ఇబ్బందులు పడుతున్నాం...



నిత్యం మండల కేంద్రానికి వెళ్లాలంటే కంకర రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రోడ్డుపై వెళ్తుంటే వాహనాలు చెడిపోతున్నాయి. ప్రత్యేక దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతు చేయించాలి.

\- పట్టి వినోద్, చిన్నగుడిపేట

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజ్ చెల్లించాలి

దండేపల్లి, జనవరి19(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో చదువుతున్న అభ్యాసకులు ఈనెల 22లోగా పరీక్ష ఫీజ్ చెల్లించాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నరేందుల శ్రీనివాస్, సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, మే నెలలో పరీక్షలు జరుగుతాయన్నారు. మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాలలో చెల్లించి రసీదు పొందాలన్నారు. ఓపెన్ టెన్త్ పరీక్ష ఫీజు ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ ఒక సబ్జెక్టుకు రూ.150 చొప్పున చెల్లించాలన్నారు. వివరాలకు దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లేదా సెల్‌నెంబర్ 8309769067లో సంప్రదించాలన్నారు.

జనగామలో పశువుల సంత

కోటపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనగామ గ్రామంలో ఆదివారం నిర్వహించిన పశువుల సంతలో పలువురు రైతులు ఎద్దులను కొనుగోలు చేశారు. ఈ అంగడికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. ఎద్దులను విక్రయించేందుకు పలువురు రైతులు ఎడ్లను తీసుకురాగా కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. ప్రతీ ఆదివారం సంత జరుగుతుందని రైతులు రావాలని మాజీ సర్పంచు గట్టు లక్ష్మణ్‌గౌడ్ కోరారు.

పరామర్శ

గర్మిళ్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు టీచర్ ఏనుగు రాజిరెడ్డి ఇటీవల మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న జాతర నిర్వహణ కమిటీ సభ్యులు

కాసిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కుర్రెఘాడ్ పాహండి కూపర్‌లింగు స్వామి జాతర ఈ నెల 29 నుంచి 31 వరకు జరిగే పోస్టర్లను ఆదివారం కుర్రెఘాడ్‌లో జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆడె కృష్ణరావు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 29న భజన, 30న అగ్నిగుండ ప్రవేశం, దర్బార్, ముగింపు, పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

బెల్లంపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మన అమ్మకు మన సారె కార్యక్రమం నిర్వహించి సారె పోశారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కార్యక్రమం చేపట్టినట్లు వాసవీ ఆలయ అధ్యక్షుడు రాచర్ల సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు 'అపార్' గుర్తింపు

విద్యార్థుల సమగ్ర సమాచారం కోసం కేంద్ర ప్రభుత్వం 'అపార్' రూపొందించింది. అపార్ అంటే ఆటోమెటిక్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ. ఇందులో ఒక విద్యార్థికి సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. అతడు ఏఏ తరగతి ఎక్కడ చదివాడు అనే వివరాలన్నీ ఉంటాయి. ఈ అపార్‌లోని 12 అంకెల నంబరుతో ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు వంటి వాటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- జిల్లాలో కొనసాగుతున్న నమోదు ప్రక్రియ
- విద్యార్థుల సమగ్ర సమాచారం కోసం 'అపార్'
- జిల్లా వ్యాప్తంగా లక్షకుపైగా విద్యార్థులు
- సాంకేతిక సమస్యలతో వెనుకబాటు
- ఈనెల 31తో ముగియనున్న గడువు

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం 12అంకెల నెంబరుతో అపార్ నమోదుకు ఆదేశాలివ్వగా ప్రక్రియను జిల్లావ్యాప్తంగా కొన సాగిస్తున్నారు. ఈ నంబరు భవిష్యత్తులో విద్యార్థులకు కీలకంగా మారనుండడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేపడుతు న్నారు. ఈనెల31లోగా ప్రక్రియకు గడువు విధించింది. జిల్లా వ్యాప్తంగా ఆయాస్కూళ్లలో లక్షకు పైగా విద్యార్థులున్నారు. విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇందులో ఉంటుంది. విద్యార్థి ఎక్కడ చదివారు, ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి అనే వ్యక్తిగత వివరాలు అందులో ఉంటాయి. విద్యార్థులు ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు వంటి వాటికి అపార్ కార్డులోని 12అంకెల నంబరురు ఉపయోగించి దరఖాస్తు చేసుకునేలా దీనిని రూపొం దిస్తున్నారు. విద్యార్థుల భవిష్యతుకు ఇది ప్రామాణికంగా మారనుండడంతో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది ప్రత్యేకశద్ధతో ఈ అపార్ నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో నమోదు కావాలంటే మరింత గడువు అవసరమని ఉధ్యాయులు పేర్కొంటున్నారు.

● వన్‌నేషన్ వన్ స్టూడెంట్ ఐడీలో భాగంగా..

జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా కేంద్రప్రభుత్వం ప్రారంభించిన వన్‌నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ కార్యక్రమం ఇది. అపార్ ఐడీ ద్వారా విద్యార్థుల పురోగతిని పరిశీలించవచ్చు. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరోపాఠశాలకు బదిలీ కావాలన్నా, ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు చేసుకోవాలన్నా, ఈఅపార్ ఐడీని ఉపయోగించుకోవచ్చు. భవిష్యతులో ఉన్నత చదువులకు, ఉద్యోగ దరఖాస్తులకు సైతం ఇది పనిచేయనుందని కాగజ్‌నగర్ ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు.

ఒకటో తరగతి నుంచి పదోతరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థు లందరికీ అపార్ ఐడీని నయోదు చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యూడైస్‌లో ఇప్పటికే ఉన్న విద్యా ర్థుల పర్మినెంట్ ఎన్‌రోల్ మెంట్ నెంబర్ (పెన్) వివరాలకు సరిపోకపోవడంతో సమస్య తలెత్తుతోంది. చాలా మంది విద్యార్థుల వ్యక్తి గత వివరాలకు, ఆధార్ సమా చారానికి సరిపోవడం లేదు. దీంతో సకాలంలో అపార్ నమోదు చేయలేక కొన్ని పాఠశాల్లో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

● తప్పని ఇబ్బందులు..

జిల్లా వ్యాప్తంగా అపార్‌లో పేరు మార్పులు ఇతర అక్షర దోషాలు, తదితర సాంకేతిక ఇబ్బందులు ఏర్పడుతు న్నాయి. పుట్టినతేదీ, ఇతరమార్పులతో కాలయాపన జరుగుతోందని అధి కారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే అధికా రులు, సిబ్బంది సాంకేతిక సమస్యలపై సమన్వయం చేసు కుంటూ వెళ్లాల్సిన అవసరం ఉందంటున్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఇతర బోనఫైడ్ సమస్యలను అధిగమించినట్లయితే పూర్తిస్థాయి లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

'అపార్' కార్యక్రమం పూర్తి చేసేందుకు చర్యలు..

-వాసాల ప్రభాకర్, ఎంఈవో, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం, పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాల్లో అపార్ పూర్తి చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతీ విద్యార్థికి అపార్ నమోదు ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నాం. కొన్ని సాంకేతిక లోపాలు తలెత్తుతున్నప్పటికీ అపార్ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నూతి అభిలాష్‌కు కవిశ్రేష్ట పురస్కారం



అభిలాష్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మేదరిగూడ ఎంపీపీఎస్‌లో ఎస్జీటీ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న కవి డాక్టర్ నూతి అభిలాష్ ఆదివారం కరీంనగర్‌లో కవిశ్రేష్ట పురస్కారం అందుకున్నారు. డాక్టర్ నూతి అభిలాష్ తెలుగు, ఆంగ్ల భాషలలో అనేక రచనలు చేశారు. ఆయన కృషికి గుర్తింపుగా ఆదివారం కరీంనగర్ ఫిల్మ్‌భవన్ వేదికగా అంతర్జాతీయ గుర్తింపుపొందిన గౌతమేశ్వరా సాహితీకళా సేవాసంస్థ, ఆర్యాణి సకలకళావేదిక సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కవిశ్రేష్ట పురస్కారాన్ని అభిలాష్‌కు అందజేసినట్లుగా నిర్వాహకులు డాక్టర్ దూడపాక శ్రీధర్ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రము కవి, విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్, దీక్షితుల సుబ్రమణ్యంతదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

పెంచికలపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి గ్రామంలో కొలువైన పోచమ్మఆలయ మొదటి వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. దేవర వినోద్ స్వామి ఆధ్వర్యంలో బోనాలు ఎత్తుకున్న భక్తులు గ్రామవీధుల గుండా భాజాభజంత్రీలతో శోభా యాత్రగా పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. చండీ హోమం నిర్వహించి అగ్నిగుండ ప్రవేశాలు చేశారు. అనంతరం అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు మహాప్రసాదం వితరణ చేశారు.



బోనాలతో అగ్నిగుండంలో నడిచేందుకు వస్తున్న గ్రామస్థులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పక్కన సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

కాగజ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం కాగజ్‌నరగ్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ సాగుకు యోగ్యం కాని భూములను, వెంచర్లు, లేఅవుట్లు తదితరాలను రైతుభరోసా జాబితానుంచి తొలగించాలన్నారు. సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితా రూపొందించాలని తెలిపారు. అర్హతగల ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా జాబితాలను గ్రామసభలో చదివి వినిపించాలన్నారు. అర్హతగల వారు రేషన్‌కార్డు కొరకు దరఖాస్తు కోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ రేషన్‌కార్డుల సర్వేను అధికారులు పక్కాగా చేపట్టాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చురుకుగా ఏటీఏ సభ్యత్వ నమోదు

జైనూర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో ఏటీఏ (ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్) సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుకుగా కొనసాగుతోందని ఆ సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కొట్నాక భీంరావ్ అన్నారు. స్థానిక బాలికల ఆశ్రమోన్నతపాఠశాలలో ఆదివారం ఆయన ఏటీఏ సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో కేవలం ఏటీఏ మాత్రమే ముందు వరుసలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లాప్రధానకార్యదర్శి మడావి మనో హర్, అధ్యక్షుడు ఆడ జంగు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

జైనూర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకోసం ఇదివరకే సర్వే చురుకుగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్, నాయకులు కనక గంగారాం, భుజంగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

చెప్రాలలో భక్తుల సందడి

● పూజలు చేసిన ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

బెజ్జూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి అభయాంజనేయస్వామి ఆలయంనుంచి మహారాష్ట్రలోని చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రానికి వెళ్లిన పాదయాత్ర భక్తులతో ఆదివారం సదండి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆధ్యాత్మికకేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సమీప ప్రాణహితనది నుంచి భాజా భజంత్రీలతో గంగాజలాలను తెచ్చి ఆలయంలోని దేవతామూర్తులకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక మహారాజ్ ఉత్సవవిగ్రహానికి ఎమ్మెల్యే, భక్తులు పాదపూజ చేశారు. అనంతరం ఆలయంచుట్టూ కార్తీక్‌స్వామి ఉత్సవ విగ్రహంలో పల్లకీ శోభ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి మండలాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని పలుప్రాంతాల నుంచి భక్తజనం తరలిరావ డంతో ఆధ్యాత్మిక కేంద్రం భక్తజనంతో నిండిపోయింది. పాదయాత్రకు వచ్చిన భక్తులకు బెజ్జూరుకు చెందిన పుల్లూరి మనీషా సంతోష్ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీఎస్‌టీడబ్ల్యూటీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉపాధ్యాయ సంఘం, పీజీ హెడ్ మాస్టర్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదివారం టీఎస్ టీడబ్ల్యూటీయూ డైరీ, క్యాలెం డర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోపాల్, ఉద్ధవ్, కృష్ణారావు, ప్రసాద్, అశక్, యశ్వంత్, అనంత్, తదితరులు పాల్గొన్నారు.

సమతా సైనిక్‌దళ్‌లో భాగస్వాములు కావాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిద్ధార్థ

వాంకిడి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దళిత యువకులు సమతా సైనిక్‌దళ్‌లో భాగస్వాములై సమాజసేవ చేయాలని సమతాసైనిక్ దళ్ రాష్ట్రప్రధానకార్యదర్శి దుర్గంసిద్ధార్థ రామ్మూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన సమతా సైనిక్‌దళ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత సమతా సైనిక్‌దళ్ సైనికుడై సమాజసేవ చేయాలన్నారు. త్వరలోనే ఆసిఫాబాద్ జిల్లాలో సమతా సైనికదళ్ కార్యక్రమాలతో పాటు అంబేద్కర్, బుద్ధుడి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సురేష్, సందీప్, విలాస్, చింటు, రాజేశ్వర్, మనోజ్, సంజీవ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఒకే పార్టీలో ఉంటూ విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీలో కొనసాగుతూ కాంగ్రెస్‌నేతలపై కాంగ్రెస్‌పార్టీ సిర్పూర్ తాలూ కా ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ విమర్శలు చేయడం సరికాదని టీపీసీసీ మెంబర్ హర్షద్ హుస్సేన్, మాజీ జడ్పీటీసీ సిడాం గణపతి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ ఇటీవల దండె విఠల్ ఆయన అనుచరగణంపై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి కోసం సమన్వయంతో కృషిచేయాల్సిన వారు ఇష్టారీతిన విమర్శలు చేసి పార్టీకి చెడ్డపేరు చేస్తున్నారని ఆరోపించారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా అధిష్టానానికి ఫిర్యాదు చేయాలన్నారు. అంతేగాని చిల్లరమాటలు మాట్లాడి పార్టీ పరువు తీయవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పుష్పలత, శ్రీవర్ధన్, సదాశివ్, రాజన్న, లింగయ్య, రమేష్, అశోక్, షణ్ముఖ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు

కాగజ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో వచ్చేనెల 12నుంచి జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జాతర కమిటీ కన్వీనర్ తుమ్మరమేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ గద్దెల పూజల కోసం ఏర్పాట్లు, భక్తుల కోసం బ్యారికేడ్ల తదితరాలపై కమిటీ సభ్యులతో చర్చించామన్నారు. సమావేశంలో కార్యదర్శి పోలోజు శ్రీనివాస్, మందరా జయ్య, అవదూత శ్రీనివాస్, పిరిసింగుల శ్రీనివాస్, దొంతమల్ల వెంకటేష్, కోట శంకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతర కమిటీ కన్వీనర్ తుమ్మ రమేష్

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 1989-90 బ్యాచ్ విద్యార్థులు

కాగజ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ ఉన్నతపాఠశాల 1989-90బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక పద్మశాలి భవన్‌లో పూర్వవిద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

క్రీడలతోపాటు చదువులో రాణించాలి: ఎమ్మెల్సీ

పెంచికలపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): క్రీడలతో పాటు గిరిజన యువకులు చదువులోనూ రాణించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్కపల్లి, పెంచికలపేట, ఆగర్‌గూడ, కమ్మర్‌గాం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ ప్రాంత గ్రామాల రోడ్ల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కమ్మర్‌గాంలో ఏర్పాటు చేసిన కుమరంభీం స్మారక వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎల్కపల్లిలో కాంగ్రెస్‌కార్యకర్త శంకర్‌గౌడ్ తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పుష్పలత, నాయకులు హర్షద్ హుస్సేన్, గణపతి, చంద్రమౌళి, కృష్ణ, శంకర్‌గౌడ్, మధునయ్య, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

నేటి ప్రజావాణి రద్దు

ఆసిఫాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇండ్లు, ఇందిరమ్మఆత్మీయ భరోసా సర్వే జరుగుతున్న దృష్ట్యా అధికారులు సర్వే ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వచ్చేనెల 16న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆసిఫాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని వచ్చేనెల 16న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శైలేష్, శ్రీనాథ్, శ్రీనివాస్, సత్యనారాయణ, కృపాల్, ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు తెలిపారు. ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులందరూ హాజరు కావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్‌టీచర్(హిందీ-1) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ప్రత్యేకాధికారి కె నలంద ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఆసిఫాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములుపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఊశన్న ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. ఘటనను నిరసిస్తూ సోమవారం మధ్యాహ్న విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపడతామన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడికి సన్మానం

రెబ్బెన, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగల్‌గూడ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లావుడ్య రమేష్ ఆర్టీఏ నాన్ ఆఫిషియల్ మెంబర్‌గా నామినేట్ అయిన సందర్భంగా ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లావుడ్య రమేష్ మాట్లాడుతూ తనకు కీలక పోస్టుకు ఎంపిక చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాజి అనిల్‌గౌడ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మాజీ సర్పంచి చెన్న సోమశేఖర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పస్తం పోశం, కమల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనులకు లబ్ధి

● రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనులకు ఎంతగానో లబ్ధి జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మానిక్‌పటార్ గ్రామంలో పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ మానిక్‌పటార్ గ్రామం 1950నుంచి గుర్తించబడిందన్నారు. 70 ఏళ్లుగా నివసిస్తున్నా ఇక్కడి ప్రజలకు కనీసం ఇళ్లు, రోడ్డు సౌకర్యం లేదన్నారు. ప్రస్తుతం ఈ గ్రామాన్ని టైగర్ రిజర్వు ప్రాంతంగా పరిగణిస్తూ తొలగించాలని కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసులకు మౌలిక సౌకర్యాలు కల్పించకుండా వారిని తీసివేయాలని చూస్తే ఊరుకోమన్నారు. ఇక్కడున్న ఎమ్మెల్యే సమస్యలపై పట్టించుకోవటం లేదన్నారు. అనంతరం గిరిజనుతో కలిసి ఆయన నృత్యాలు చేశారు. అంతకుముందు ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ లెండు గురే శ్యాంరావు, కోకన్వీనర్ రాం ప్రసాద్, యూత్‌కన్వీనర్ కావుపాక రాజు, మండల కన్వీనర్ ఆవుల రాజ్‌కుమార్, నవీన్, షేక్ చాంద్, అస్లాం బండి, బండి వాసు, గ్రామ పెద్దలు మురళి పటేల్ మహిళలు ఉన్నారు.